ఆలయ గాలిగోపురం పునఃనిర్మాణానికి భూమిపూజ



శామీర్‌పేట్: ఉద్దెమర్రి గ్రామంలోని అక్కన్న, మాదన్న నిర్మించిన శ్రీ విష్ణు శివాలయం గాలి గోపురం పునఃనిర్మాణ పనులకు సోమవారం వేకువజామును భూమి పూజ చేశారు. ముఖ్య అతిథులుగా శ్రీ కంచి పీఠాధీశ్వరులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి, శ్రీ గురు మదనానంద సరస్వతి స్వామి హాజరై గాలి గోపురం పనులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామి వారికి అభిషేకం చేశారు. ఆలయ చైర్మన్ ఉమా మహేశ్వరి, అర్చకులు మాధవశర్మ, ధర్మకర్తలు రవీందర్ గౌడ్, రమేశ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్, బాల్ నర్సింహ్మ, నాయకులు విష్ణుగౌడ్, బలరాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌చారి, ప్రసాద్, నర్సింహ్ములు, శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామికి పుష్పార్చన



రామలింగేశ్వర స్వామి పల్లకీ సేవలో పాల్గొన్న చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం గర్భాలయంలో కొలువైన రామలింగేశ్వరుడికి అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం పూజల అనంతరం అర్చకులు స్వామివారికి నానావిధ పుష్పార్చన పూజలను నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి నిర్వహించిన పల్లకీ సేవలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రావణమాసం రాఖీపౌర్ణమి సోమవారం కావడం చేత వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కీసరగుట్ట స్వామి దర్శనం కోసం విచ్చేశారు. అనంతరం ప్రధాన గోపురానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు పాలు, పువ్వులు, పసుపు, కుంకుమలతో అభిషేకాలు నిర్వహించారు.

వేడుకగా అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ కావేరీమశ్చందర్‌రెడ్డి దంపతులు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మైసమ్మ, పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో ఆయా అమ్మవార్ల విగ్రహాలను సోమవారం అంగరంగ వైభవంగా ప్రతిష్ఠించారు. విగ్రహాల దాత, మాజీ సర్పంచ్ ఏనుగు కావేరీమశ్చేందర్‌రెడ్డి దంపతులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు సుదర్శన్, విశ్వనాథం, భాస్కర్, శ్రీనివాస్, ప్రభాకర్, వెంకటేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫొటోగ్రాఫర్‌కు సన్మానం



కిశోర్ బాబును సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపికైన పౌరసంబంధాల సమాచార శాఖ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఫొటో గ్రాఫర్ కిశోర్‌బాబును రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ ఎం.హనుమంత రావు శాలువా, మోమెంటోతో సత్కరించారు. సోమవారం నగరంలోని బేగంపేట్ గ్రీన్ పార్క్ హోటల్‌లో ఆయనకు ప్రశంసా పత్రంతోపాటు నగదును అందజేశారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఉత్తమ ఫొటోగ్రాఫర్లను ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ అధికారులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఅండ్ పీఆర్ జిల్లా అధికారి నాగాంజలి, ఇన్‌చార్జ్ డీపీఆర్‌ఓ స్వర్ణలత జిల్లా పౌరసంబంధాల సమాచార శాఖ ఫొటో గ్రాఫర్ కిశోర్‌బాబును అభినందించారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండగ



డీఎంహెచ్‌ఓ రఘునాథస్వామికి రాఖీ కడుతున్న మహిళా ఉద్యోగులు

సాక్షి, సిటీబ్యూరో: రాఖీ పండగ సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టరు. టి రఘునాథస్వామికి సోమవారం మహిళా అధికారులు, ఉద్యోగులు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథస్వామి మాట్లాడుతూ... తనపై అభిమానం, ప్రేమతో రాఖీలు కట్టిన సోదరీమణులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ.. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఇలాంటి పండుగను అందరూ ప్రేమ, అభిమానాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నడ్డి విరిచే గుంతలతో పరేషాన్!



సువిశాలంగా ఉన్న పాత రహదారి

చెరువు కట్టపై రోడ్డులో అడుగుకో గుంత

- చిరు జల్లులకే బురదమయం
- ప్రత్యామ్నాయ రోడ్డుగా ఉన్నా ఉపయోగం సున్నా
- వాహనదారులు, పాదచారులకు ఎన్ని ఇబ్బందులో...

మేడ్చల్: మేడ్చల్ నుంచి మేడ్చల్ చెక్‌పోస్టు వరకు ఉన్న పాత 44వ జాతీయ రహదారి కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారుతుంది. మేడ్చల్ పెద్ద చెరువు కట్టపై నుంచి గతంలో 44వ జాతీయ రహదారి ఉండేది. ఏళ్ల క్రితం మరో రహదారిని నిర్మించడంతో ఆ రోడ్డు కట్టకు పరిమితం అయ్యింది. మేడ్చల్ పట్టణంలో 44వ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్‌లు నిర్మించడం, విస్తరణ పనులు చేపడుతుండటంతో పట్టణ పరిధిలో కిలోమీటర్ ప్రయాణానికి గంటల తరబడి సమయం పడుతుంది. చెక్‌పోస్ట్ నుంచి ఐటీఐ వరకు నిత్యం ట్రాఫిక్ జాం అవుతుంది. రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుండటంతో నిత్యం జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి తిప్పలు తప్పడం లేదు. దీంతో కాలనీలలో, పాత మేడ్చల్‌లో నివసముండే ప్రజలు హౌసింగ్ బోర్డు కాలనీ, మార్కెట్ రోడ్డు మీదుగా పాత రహదారి (కట్ట)పై నుంచి చెక్‌పోస్ట్ వరకు వెళ్లి అక్కడి నుంచి జాతీయ రహదారి పైకి ఎక్కి ప్రయాణం సాగిస్తున్నారు. సువిశాలంగా రోడ్డు ఉన్నా ప్రయాణానికి అనువుగా లేకపోవడంతో ఆ రోడ్డులో వెళ్లాలంటే జంకుతున్నారు.



బురదమయంగా రోడ్డు





చెరువు కట్ట రోడ్డుపై ఉన్న గుంతలు

అడుగుకో గుంత...

చెరువు కట్టపై ఉన్న రోడ్డుకు కనీస మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డంతా అడుకో గుంత ఉంది. రోడ్డంతా మట్టి రోడ్డు కావడంతో గుంతలు ఎక్కువగా ఉన్నాయి. చిన్న వర్షం కురిస్తే చాలు రోడ్డంతా బురదమయంలా తయారవుతుంది. గుంతలో నీరు, బురద, రోడ్డంతా గుంతలతో రోడ్డు ఏమాత్రం ప్రయాణానికి వీలు లేకుండా పోయింది.

ఒక వైపు ప్రధాన రహదారిపై మరమ్మతులతో ట్రాఫిక్ సమస్య ప్రయాణం నరకం కాగా ప్రత్యామ్నాయ రోడ్డులో వెళదామంటే ఏమాత్రం అనువుగా లేకపోవడంతో మేడ్చల్ ప్రజలు మేడ్చల్ దాటడానికి నిత్యం గుంతలతో కుస్తీలు పట్టాల్సి వస్తుంది.

గతంలో ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు చెరువు కట్ట రోడ్డును ప్రత్యామ్నాయ రోడ్డుగా మరచి తాత్కాలిక మరమ్మతులు చేసిన అవి సరిపోలేదు.

- 44వ జాతీయ రహదారిపై విస్తరణ పనులు, ఫ్లైఓవర్ నిర్మాణల పనులు సుదీర్ఘంగా జరిగే పనులు కావడంతో మేడ్చల్‌వాసుల కోసం ప్రత్యామ్నాయ రోడ్డును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మేడ్చల్ పట్టణానికి చెందిన కాలనీల వాసులు, పాత మేడ్చల్‌వాసులు కట్టపై ఉన్న రోడ్డును అభివృద్ధి చేస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులువుగా వాహనాలపై ప్రయాణం చేయవచ్చు. పారిశ్రామిక వాడ చెక్‌పోస్ట్ సమీపంలోనే ఉండటంతో కార్మికులకు, పాదచారులకు ఈ రోడ్డు అభివృద్ధి చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

అభివృద్ధి చేస్తాం



ప్రజల ఇబ్బందులను తొలగించడానికి చెరువు కట్టపై నుంచి పాత రహదారిని అభివృద్ధి చేస్తున్నాం. వివేకానంద విగ్రహ కూడలి నుంచి మార్కెట్ మీదుగా చెరువు కట్ట మీదుగా చెక్‌పోస్ట్ వరకు రోడ్డును అభివృద్ధి చేస్తే ప్రత్యామ్నాయ రోడ్డుగా మారుతుంది. వివేకానంద విగ్రహం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు రోడ్డుపై ఉన్న చిల్లర వ్యాపారులు బండ్లను పూర్తిగా తొలగించి, అక్రమ పార్కింగ్‌లు చేయకుండా రోడ్డును విశాలంగా మార్చి, తగు మరమ్మతులు చేసి అందరికీ అందుబాటులోకి తేస్తాం.

– దీపికానర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్

హెచ్‌ఎండీఏకు లేఖ రాశాం



హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న మేడ్చల్ పెద్ద చెరువు కట్ట రోడ్డుగా, కట్టగా రెండు విధాలా ఉపయోగపడే విధంగా ఉండటంతో హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేయాలని ఇప్పటికే మున్సిపాలిటీ నుంచి పలు లేఖలు రాశాం. అధికారులతో మాట్లాడి హెచ్‌ఎండీఏ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే కట్టను అభివృద్ధి చేసి అందమైన పటిష్టమైన రోడ్డు నిర్మిస్తాం. కట్టను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలోని కండ్లకోయ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొన్ని పరిశ్రమలకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొన్ని పరిశ్రమలకు, విద్యా సంస్థలు, విత్తన కంపెనీలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రజావాణిలో 29 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి, వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు .సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఆయనకు 29 ఫిర్యాదులను అందజేశారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సుల్లో అడ్మిషన్లు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని కైట్ ఇంజినీరింగ్ కళాశాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉప్పల్ బాలుర జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఒకేషనల్ కోర్సులు టీ అండ్ ఎంఎం, ఎంఎల్‌టీలో పరిమిత సంఖ్యలో ఉన్న ఖాళీలను పూరించడానికి మంగళవారం ఉదయం 11 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. మార్చి 2024లో మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులై ఆసక్తి ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. వివరాలకు ఫోన్: 79950 10644లో సంప్రదించాలని సూచించారు.

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన క్రీడాకారిణులకు అభినందన

ఘట్‌కేసర్: సీనియర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లాలో ఈ నెల 17, 18వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో అంకుషాపూర్‌లోని మహేంద్రహిల్స్, ఇబ్రహీంపట్నం గురుకుల డిగ్రీ, పీజీ మహిళ కళాశాల విద్యార్థినులు సత్తాచాటారు. మహేంద్రాహిల్స్ కళాశాలకు చెందిన ఎస్.బుచ్చమ్మ అండర్ 23 షాట్‌పుట్‌లో స్వర్ణ పతకం, ఎస్.అనూష 10 వేలు, 5 వేల పరుగు పందెంలో స్వర్ణ పతకం, రజత పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో టాబు రజత పతకం, 15 వందలు, 5 వేల మీటర్ల పరుగు పందెంలో ఉషారాణి క్యాంస పతకం సాధించారు. ఇబ్రహీంపట్నం కళాశాలకు చెందిన జి.ఉషారాణి తృతీయ స్థానంలో నిలవడంతో ప్రిన్సిపాల్ రాధిక ఆమెకు షూతో పాటు రూ. 1500 నగదు బహుమతి అందజేశారు. అలాగే మహేంద్రహిల్స్ క్రీడాకారులను ప్రిన్సిపాల్ డాక్టర్ స్నేహలత సోమవారం అభినందించారు. కార్యక్రమంలో అయ్యంగార్, వైజయంతి, విజయలక్ష్మీ, సుప్రియ, స్వరూప, కవిత, స్వప్న, కోచ్ భిక్షపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

సివిల్స్ టాపర్ అనన్యకు అభినందన సత్కారం

ఘట్‌కేసర్: సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన అనన్యరెడ్డిని సోమవారం కాచవానిసింగారం దివ్యానగర్ కాలనీ గ్రీన్ నెస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్యరెడ్డి తొలి ప్రయత్నంలోనే దేశంలోనే అత్యున్నత సర్వీస్ అయిన ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆమె ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా యూపీఎస్‌సీకి ఎంపిక కావడం అభినందనీయమని, యువత ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మనోరంజన్‌రెడ్డి, విజయరాంరెడ్డి, వెంకటరమణారెడ్డి, పురుషోత్తమ రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



అనన్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రొఫెసర్ కోదండరాంకు సన్మానం

మల్కాజిగిరి: ఎమ్మెల్సీగా నియమితులైన ప్రొఫెసర్ కోదండరాంను తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు హనుమయ్య, రవీందర్‌గౌడ్, గోపాల్, శేఖర్, చంద్రశేఖర్, వెంకట్, రాములు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు, నిరుద్యోగల తరుపున చట్టసభలో గళం వినిపించడానికి ప్రొఫెసర్‌కు అవకాశం రావడం హర్షనీయమన్నారు.



ఇంటింటా రాఖీ సందడి

ఎమ్మెల్యే, ఎంపీలకు రాఖీలు కట్టిన మహిళలు, సోదరీమణులు

మేడ్చల్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతికగా నిలిచే రాఖీ పండుగ వేడుకలను మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. వారికి కానుకలు అందజేసి సంతోషంగా గడిపారు. రాఖీ పండగ నేపథ్యంలో మిఠాయిలు, రాఖీ దుకాణాలు కిటకిటలాడాయి.

- ఎంపీ ఈటలకు, ఎమ్మెల్యే మల్లారెడ్డిలకు మహిళా ప్రజా ప్రతినిధులు నియోజకవర్గంలోని మహిళా నాయకురాళ్లు, బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు.
- నాయకుల ఇంటికి వెళ్లి మహిళా నాయకురాళ్లు, మున్సిపల్ చైర్ పర్సన్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు మాజీ మంత్రి మల్లారెడ్డికి, ఎంపీ ఈటలకు రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డిలకు రాఖీలు కడుతున్న సోదరీమణులు



గుండ్లపోచంపల్లిలో రాఖీ సంబరాల్లో చిన్నారులు



అవుషాపూర్‌లో మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు



ఘట్‌కేసర్‌లో రాఖీ కడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్ పరిధిలో...

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల్లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు తమ సోదరులకు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య తన సోదరులకు రాఖీ కట్టగా, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డికి సోదరీమణులు, పలువురు మహిళలు రాఖీ కట్టారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన: వ్యక్తి రిమాండ్

ఘట్‌కేసర్: మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... ఒడిసా రాష్ట్రానికి చెందిన మైఖేల్(44) ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఓ కాలనీలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. అదే కాలనీకి చెందిన బాలిక(9) పట్ల ఆదివారం అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలిక తల్లితండ్రులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మైఖేల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.



నాచారంలో శాంతి ర్యాలీలో పాల్గొన్న యువత

కొవ్వొత్తుల ర్యాలీ

మల్లాపూర్: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్యను ఖండిస్తూ సోమవారం సాయంతం నాచారంలో భవానీనగర్, శ్రీనగర్‌కాలనీ నుంచి నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వరకు నడిగోటు బాలకృష్ణ, సాద్దినేని అమర్నాథ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ఆడపిల్లలకు భద్రత పెంచడంతో పాటు దోషులను ఉరి తీయాలని నినాదాలు చేశారు. రవికాంత్, మంజులవాణి, భవిష్‌గౌడ్, విశాల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మమతాబెనర్జీ దిష్టిబొమ్మ దహనం

సనత్‌నగర్: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు సంబంధించి సాక్ష్యాలను ధ్వంసం చేసే కుట్రలను నిరసిస్తూ సోమవారం బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ స్వామి టాకీస్ వద్ద నుంచి మమతాబెనర్జీ దిష్టి బొమ్మను ఊరేగించి దహనం చేశారు. ఈ సందర్భంగా మమతాబెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ నిందితులకు శిక్ష పడకుండా ఆధారాలను లేకుండా చేసే కుట్రను చేస్తున్నారని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మోహన్, వెంకట సుబ్బారావు, మల్లారెడ్డి, అమ్ము రాంప్రసాద్, ఆనంద్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



తార్నాక హెచ్‌పీ బంక్ పెట్రోల్‌లో వాటర్

- కల్తీ పెట్రోల్‌తో మొరాయించిన పలు వాహనాలు
- బంక్ వద్ద ఆందోళన చేపట్టిన వాహనదారులు

లాలాపేట: తార్నాక చౌరస్తాలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో ఆదివారం రాత్రి పెట్రోల్‌లో నీళ్ల వచ్చాయి. ఈ బంక్‌లో పెట్రోలు పోసుకున్న పలు వాహనదారులు కొంతదూరం వెళ్లాక వాహనాలు ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని మెకానిక్‌లకు చూపించగా పెట్రోల్‌లో నీరు కలిసిందని తెలిపారు. ఈ విధంగా దాదాపు 15 మంది వాహనదారులు ఆగ్రహంతో తార్నాక హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుని బంక్ నిర్వాహకులను నిలదీశారు. దీంతో దిగివచ్చిన బంక్ మేనేజర్ మాట్లాడుతూ పెట్రోల్‌లో వాటర్ కలిసినట్లు తాము గుర్తించామని, వాటర్ కలిసిన పెట్రోల్ పోయించుకున్న వాహనాలన్నీ రిపేరు చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బాధితులకు మద్దతుగా వచ్చిన స్థానిక బీజేపీ నేతలు వెంకటేష్‌గౌడ్, వీరన్న తదితరులు మాట్లాడుతూ గతంలో పలు మార్లు ఈ బంక్‌లో కల్తీ పెట్రోల్‌లు, మీటర్ ట్యాంపరింగ్‌తో పలు వివాదాలు నెలకొన్నాయన్నారు. ఇక్కడ పెట్రోలుతో వాహనాలు పాడైతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత తూనికలు కొలతల అధికారులు స్పందించి మోసాలకు పాల్పడుతున్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేస్తున్నారు.



తార్నాకలోని హెచ్‌పి పెట్రోల్ బంక్



బంక్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఓ వాహనదారుడు.




ఓ కారు నుంచి తీసిన నీళ్లు కలిసిన పెట్రోల్

నాగారంలో రెండు ఫిర్యాదులు

కీసర: నాగారం మున్సిపాలిటీలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదార్బర్‌లో ప్రజల నుంచి 2 ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు.

ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా కిషోర్



ఉప్పల్: ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్ ఆధ్వర్యంలోని ఉప్పల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా జెట్ట కిషోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రతిఏటా ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంటప నిర్వాహకులను ఏకం చేసి అనేక సేవా కార్యక్రమాలతో పాటు ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు పోలీస్ అధికారులతో సహకరిస్తూ.. వస్తున్నారు. ఇదే క్రమంలో ఈసారి కూడా ఉత్సవాలను ఘనంగా ప్రశాంతంగా జరిపేందుకు తన వంతు కృషి చేయనున్నట్లు వివరించారు. బోరంపేట రామరాజు, రవీందర్‌రెడ్డి, మేదాని రాజు, భాషపల్లి నిరంజన్‌చారి, రామ్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.